# కాలిపోయిన పూలతోట

డా. మనోహర్ కోటకొండ



ఎగసిపడుతున్న మంటలు... ఫెళఫెళమని ... గబగబా అంటుకుని అన్నివైపులకూ ప్రాకి... ఆకలి ఆకలిగా.. ఎర్రని నాలుకలతో... భరించలేనంత వేడి... ఎన్ని డిగ్రీల సెల్సియస్సో.. ఎవరు చూడగలరు.. నిట్టనిలువుగా పెరిగిన ఇరుకు మెట్ల స్కూలు బిల్డింగ్.. కాలిపోతూ...

మమ్మీ, డాడీ - ఈ ఏడ్పులు ... గుక్కతిప్పు కోలేనంత........ గుక్క తీసుకోవాలంటే గాలి వుండాలి కదూ! చుట్టూ పొగ.. వేడి.. ఎక్కడికి వెళ్ళాలో ఎలా తప్పించుకోవాలో తోచని బాల్యం.... హై ఫ్రీక్వెన్సీలో ఆక్రందనలు అగ్నికీల లతోపాటు ఒక్కసారిగా పైకెగసాయి... వేడికి పసి గుండెలు కరిగి ఆవిరైపోయాయి. పొగచూరిన వూపిరితిత్తులు పనిచేయలేమంటూ ఆగిపో యాయి... ఒక్కరా? ఇద్దరా? వందమందా? ఎంతమంది అనేది లెక్కే కాదు. ఎన్ని ఆశలు... కాలిపోతున్నాయో? ఆ లేత మనసులకు ఏం జరుగుతున్నదో కూడా తెలియదు. ఆ పొగలో... వేడిలో.. అక్కడే సొమ్మసిల్లి... చివరి శ్వాస వదిలి... అదే క్షణంలో ఆ మంటలే చితిమంటలై దహించబడిపోయాయి.

సార్... సార్... సార్ .. నా బిడ్డ సార్... ఇప్పుడే కొత్త బూట్లు తొడిగి, క్రాపు దువ్వి యూనిఫాం బట్టలు వేసి... నిన్న రాసిన హోంవర్కు చూసి మురిసిపోయి, ముద్దుపెట్టుకుని ఇప్పుడే సార్ పంపించింది. ఎక్కడ సార్ నా బిడ్డ... సార్ కాపాడండి సార్... కొన్ని వందల గొంతుకలు కోరస్‌గా.. ఓ పెద్ద విషాదాంతానికి సాక్షీ...

విపరీతమైన తొక్కిసలాట.. వేగంగా లోపలికి వురికి అంతే
వేగంగా కాలుతున్న మొగ్గల్ని అమాంతంగా ఎత్తుకున్నాయి
కొన్ని చేతులు.... కాపాడే చేతులు.. బలమైన చేతులు... మానవ
త్వ రక్తంలో పారుతున్న చేతులు...

ముందుకు వెళ్ళలేక వున్నచోటే వుండలేక అక్కడే కూలబడి
పోయినవారు మరికొందరు... దుఃఖం చెలియలి కట్ట దాటి ఆవే
దన, ఆక్రందనలు తోడై నా బిడ్డ... నా బిడ్డ అంటూ మంటల్ని
మించిన కేకలు.. గుండెలు బాదుకుంటూ రోదిస్తున్న తల్లులు...
దుఃఖాన్ని కొలిచే పరికరం ఏదైనా వుంటే ఈ ఒత్తిడికి... దాని
బల్బ్ పగిలి పాదరసం లావాలాగ చిమ్మి...

నిన్న ఇంట్లో నీళ్ళు నిండుకున్నాయంటే సంపులోకి
టాంకులో నీళ్ళన్నీ వదిలి వచ్చి... ఉదయాన్నే అర్జెంట్ కాల్
అటెండవ్వాల్సి వచ్చింది... అప్పటికపుడు నీరు నింపుకుని గణగ
ణమని పరుగో.. అరె బిల్డింగ్ మొత్తం అంటుకుపోయిందే...
కన్నీటి వేణ్ణీళ్లకు ఈ చన్నీళ్ళు తోడు మంటలార్పేందుకు... రేయ్
వాల్వ్ తిప్పండి... క్విక్... జుయ్ ...జుయ్... నీటి ధార ఎగసిపడే
మంటల మీద...

అన్నిటినీ కాల్చి నిలకడగా వున్న మంటల మీద నీటి జడి...
ప్రకృతి ధర్మంలా నీటికి లొంగిపోయిందా బడబాగ్ని. ఇనుప
బూట్లు టకటకమంటూ మూడో అంతస్తు చేరుకున్నాయి... అరె
రెరెరె ... అయ్యయ్యయ్యో.. అదిగోరా అక్కడ మూలుగు..
ముందు ఆ బిడ్డను తీసుకో... అదిగో ఆ పసికూన చెయ్యి కదులు
తోంది ఏంటదీ పిడికిట్లో.. అయ్యో పెన్సిల్ ఇంకా వదల్లేదా తల్లీ..
అయ్యయ్యో... త్వరత్వరగా .. రేయ్ అందుకో.. అందుకోండి
నెమ్మదిగా... అంబులెన్స్ వచ్చిందా?...

సార్.. నా బిడ్డ ఎక్కడ సార్.. నా బిడ్డను చూపండి సార్...
వందల గొంతుల ప్రశ్న... నెట్టద్దు సార్ నెట్టద్దు బిడ్డ ఎట్టుందో
చూసుకోనీయండి సార్.. కూలిపోతున్న తల్లి రోదన...

అంబులెన్స్‌లో - ఒకటా రెండా ... ఎన్ని కేసులో ..
అక్యూట్ రెస్పిరేటరీ ఫెయిల్యూర్ కేసులు.. అది కాద
నుకుంటే డయాగ్నసిస్ మారుద్దాం... లారింజి
యల్ ఎడిమా..డ్యూ... టు నాక్సిక్
గ్యాసెస్.. మృత్యువును అన
లైజ్ చేస్తూ కుర్ర
డాక్టర్లు... సెలైన్
పెట్టండి...
ఇదిగో
ఇక్కడ
అడ్రిన
లిన్
ఇవ్వు.. అదిగో అక్కడ డెకడ్రాన్ ... రెస్పిరేటరీ స్టిమ్యులెంట్స్
ఏమైనా యూజ్ వుంటాయా... ఫస్టెయిడ్ అయ్యాక షిఫ్ట్ చేస్తే
హాస్పిటల్లో వెంటిలేటర్లతో ఒకటో రెండో ప్రాణాల్ని నిలబెట్టవ
చ్చు. వూహూ ... అందర్నీ తీస్కెళ్ళడం కుదరదు... అదిగో ఆ
ప్లాట్‌ఫాం మీద పడుకోబెట్టండి... కాస్త తేరుకున్నాక షిఫ్ట్
చేద్దాం... సీనియర్ డాక్టర్ కమాండుకు మెడికల్ టీం... చక
చకా..

రేయ్ ఎవర్రా మీరు.. మా మిద్దె ఎక్కింది... మా గొడవల్లో
మేముంటే.. సార్ మేం ఫోటో జర్నలిస్టులం సార్... ఇక్క
డ్నుంచైతే ఏరియల్ వ్యూ వస్తుంది... మొత్తం తగలబడిపోతున్న
స్కూలు బిల్డింగ్.. కాలిపోతున్న పిల్లలూ... ఈ యాంగిల్లో
అంతా వస్తుంది.... నీలమైన ఆకాశం కింద నల్లటి సుడులు
సుడులుగా పొగలు ఆ కింద ఎర్రటి మంటలూ కలర్ కాంబినే
షన్ చక్కగా కుదిరింది... ఫోటో డీటైల్డుగా క్లియర్‌గా వస్తుంది...
(నాకూ మంచి పేరొస్తుంది)... కాంపిటీషన్ హెవీగా వుంది
సార్. మొత్తం రోల్ ఎక్స్‌పోజ్ చేయాలి.. జరగండి సార్..
అమ్మయ్య ఇక్కడ్నించి క్లియర్‌గా వుంది.... క్లిక్... క్లిక్... క్లిక్...

ఒరేయ్ సిఐ కూడా వచ్చాడ్రా! త్వరగా కదలండి... అట్నే
దొరా... రేయ్ డియస్పీ కూడా వస్తున్నాడట త్వరగా
దించండి... మీరు పడేరు మంటల్లో... మిమ్మల్ని
లేపాలంటే క్రేన్ కావాల్సి వుంటుంది
మొరటుగా ఓ జోకు.... చని
పోయిన... సారీ...
కాలిపోయిన



బాడీస్ ఇక్కడరా... ఇక్కడ వరసగా పెట్టండి... జనాల్ని కంట్రోల్ చేయండి.. ఏమిటో లాఠీఛార్జా... నో... నో... అయితే భాష్పవాయువు వేద్దాం సార్... ఈ నాకొడుకులందరూ పడుకొంటారు.. అప్పుడయితే మన పని సులభం ఇంకో మొరటు జోకు... ఛీ... ఛీ... అంతా చేతికి అంటుకుంటూ వుంది... వుడికిపోయిన మాంసం తాకితే కండలు వూడి వస్తున్నాయి.. చర్మం వూడి చేతికి వచ్చిందిరా... ఛీ... ఛీ... యూనిఫాం గలీజయిపోతా వుంది... ఒరేయ్ వాషింగ్ అలవెన్స్ ఇస్తా వున్నాం కదరా... ఈ నస కాస్త ఆపు... త్వరగా తీయండి... అవతల ఎమ్మెల్లే సార్ కూడా వస్తున్నాడట బందోబస్తు చేయాలి... డ్యూటీ... డ్యూటీ...

అదిగో... కరకుగా ... వేగంగా
కదులుతున్న కొన్ని చేతులు
కూలిపోయిన స్తంభాల
కింద వున్న
బిడ్డల్ని



కూడా అతిజా
గ్రత్తగా... ప్రేమగా..
కన్నీటితో తీసుకొస్తున్నాయి...
ఆ యువకులు.. మనుషులు .. మన
సుంది కాబట్టే మనుషులు.. ఉద్యోగస్తులు కాదు...
.. చూడు సడెన్‌గా ఇట్లాంటివి జరుగుతాయనే నేను ఓ
మేకప్ కిట్ వాన్లోనే వుంచేది..మెసేజ్ తెలిసిన పది నిముషాల్లో మేకప్‌తో సహా ఇక్కడున్నాం... టైంసెన్స్ ప్రకటిస్తూ యాంకర్.. కాలిన ప్రతి బిడ్డ ముఖాన్ని క్లోజప్‌లో చూపండి... అదిగో ఆ గుండెలు బాదుకుంటున్నావిడను మాంటేజ్ షాట్‌లో చూపండి ఖంగుమంటూ ప్రోగ్రాం మేనేజర్... కెమెరా ఫాలోమీ... హాండ్ మైక్ ఏడుస్తున్న తండ్రి ముఖం దగ్గరగా వుంచి... సార్ ఈ మసిబొగ్గు మీ బిడ్డే అని ఎట్లా గుర్తించారు?? ఇంటి దగ్గర ఈరోజు తాతకు టాటా చెప్పిందా లేదా? మీవాడు పెద్దయ్యాక ఏం అవుతాననేవాడు...



సడన్‌గా మీ కళ్ళముందే మీ బిడ్డ కాలిపోవడం మీకెట్లా అనిపిస్తా వుంది? మా టీవీలో మీ బిడ్డ ఏ ప్రోగ్రాం ఇష్టపడేవాడు... కమాన్ సార్...

తర్వాత
ఏడుద్దురు
గాని ముందు
సమాధానం
చెప్పండి సార్...
కాలిన వాసనను తట్టు
కుంటూ బలవంతంగా
నవ్వుతూ... ప్రోగ్రాం మేనే
జర్ సార్... చేతుల్ని చూడండి
మంటల్ని లెక్కచేయకుండా
లోపలికి దూకుతూ పిల్లల్ని తెస్తు
న్నాయి. జూమ్... జూమ్... క్విక్...
ఐదు నిముషాల్లో ఎంతమంది పిల్లల్ని
బయటకు తెస్తాయో.. పోటీ పెడదామా...
బ్రతికి వున్నవారైనా చనిపోయినవారైనా ఎవ
రైనా ఫర్వాలేదు... గిఫ్ట్ హాంపర్లు ఇచ్చేందుకు
స్పాన్సర్లు వున్నారా?.. పదండి సార్... వాళ్ళ దగ్గరకు..
ర్రేయ్. ప్రక్కకు జరగరా... పిల్లల్ని తెచ్చేందుకు అడ్డం
వస్తున్న కెమెరాను బలంగా గోడకు విసిరిందో చేయి... ఫట్
మంటూ పగిలిందది...

పసిపిల్లల్ని పై ఫ్లోరులో వుంచే బదులు గ్రౌండ్‌లో వుంచుదాం అని చాలాసార్లే చెప్పాము సార్! పైనయితే గేటు వేసేయవచ్చు. క్రిందయితే మనం ఏమరుపాటులో వుంటే రోడ్డుమీదకొ
స్తారు పిల్లలు, ఆక్సిడెంట్లు కాకుండా వాళ్ళ జీవి
తాల్ని రక్షిస్తున్నట్లు మాట్లాడాడు కర
స్పాండెంటు... ఇంతకింత
అనుభవిస్తాడు..
పొట్టకూ
టి





కోసం చేరిన ఓ టీచరమ్మ. ఎంత ముద్దుముద్దుగా చెప్పేవాళ్ళో రెయిమ్స్... అయ్యో అయ్యయ్యో అందరి బిడ్డల్ని అక్కున చేర్చుకునే టీచర్ల గొంతు బొంగుపోతూ...

హలో... ఏంటీ... మిడ్ డే మీల్ వండుతుంటే మంటలా.. స్కూలు పిల్లలు అందులో చిక్కుకుపోయారా? కొంపముంచావు గదయ్యా కరస్పాండెంటూ... వద్దు వద్దంటే లంచంతో ముంచెత్తి పర్మిషన్ తీస్కెళ్ళావు... జాగ్రత్తగా వుండక్కర్లేదా?.. వూహు... నేనేమీ చేయలేనయ్యా... స్కూల్ పర్మిషన్.. ఇంకేం స్కూలయ్యా పిల్లలు బలైపోతుంటే నీ పాపం నాకు చుట్టుకొని.. నేను సస్పెండ్ అయ్యేట్టున్నాను. ఎంక్వయిరీ కమిటీకి బాగా తడపాలి. తడి ఖర్చు ధారాళంగా చెయ్... ఉద్యోగం నిలుపుకోవాలంటే ఏం రెకమండేషన్లు పట్టుకోవాలో, ఎంత ఖర్చు చేయాలో అప్పుడే అంచనాలు మొదలుపెట్టుకుంటూ సెల్ ఆఫ్ చేశాడు విద్యాధికారి.

కాస్త జరగండి ఫోరెన్సిక్ నిపుణులొచ్చారు.. లారింగ్స్ కట్ చేస్తే అంతా స్మోకే వుంటుంది... లంగ్స్‌లోనా అబ్బే స్మోక్ అంత వుండదు. కాకపోతే సివియర్ కంజెషన్‌తో వూపిరితిత్తుల గోడల్లో రక్తం చేరి వుంటుంది.... మనిషిని చంపిన తర్వాత కాలిస్తే లంగ్స్ గోడలు క్లియర్‌గా వుంటాయి. యాంటీ మార్టమ్ బర్నింగ్‌కు పోస్టుమార్టం బర్నింగుకూ ఇదేనండి తేడా... మజిల్సన్నీ ప్రొటీన్లే కదా? చూడు అన్నీ బిగుసుకుపోయి, బాడీ బాక్సింగ్ స్టైల్లో వుంటుంది. పజిలిస్టిక్ ఆటిట్యూడ్ అంటామే ఇదే... క్లియర్‌గా వుంది కదా... మరణాన్ని సైంటిఫిక్‌గా విశ్లేషిస్తూ...

అయ్యో – అయ్యో ఎంత దారుణం... ఎంత దారుణం... పిల్లలంతా మాడి మసైపోయారు కదయ్యా... అయ్యో కన్నీళ్ళు రాని కళ్ళను పైకండువాతో తుడుచుకుంటున్నట్లు ... కవర్ చేసుకుంటూ ఎంఎల్ఏ... మా పార్టీ తరపున కాలిపోయిన వారికి పది వేలు, గాయాలైన వారికి రెండువేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నా... దుఃఖాన్ని బయటకు రానీయకుండా నోట్లు గొంతులో కుక్కే ప్రయత్నం... సార్ కాలు మాత్రమే కాలితే ఎంత... చేయి మాత్రమే కాలితే ఎంత... ఒక కాలు ఒక చేయి... రెండు కాళ్ళు రెండు చేతులూ కాలితే ఎంత... ఇట్లా విడివిడిగా లెక్కలు వేసిస్తే బావుంటుందేమో సార్... చిలిపిగా ఓ విలేఖరి...

ఐదు ఏండ్లు బాండు వ్రాసుకున్నాడు ఏమైతే నాకేం ఖాళీ చేసిపోతే ఎవరు చేరతారు. మొత్తం రిపేర్లూ.. డిస్టెంపరూ.. ఉడ్‌వర్కూ చేయించకపోతే వాడి అడ్వాన్సులో పట్టేసుకుంటూ అమ్మయ్య... అనఫిషియల్ అడ్వాన్సు రెండు లక్షలు తీసుకోవడం మేలయింది... బిల్డింగ్ ఓనర్ నిట్టూర్పు...

వరుసగా పిల్లలు... కాలిపోయి రాలిపోయిన పసిమొగ్గలు .. అందరూ వరుసగా ముద్దముద్దగా నల్లనల్లగా... వుదయాన్నే రెండు చేతులూ జోడించి ''సరస్వతీ నమస్తుభ్యం''అంటూ.... బాగా చదువురావాలని ప్రార్థన... రెండు చేతులూ బిగుసుకుపోయి... పిడికిలి బిగుసుకోని.. రోడ్డు మీద పడుకోబెట్టిన గుర్తించ వీల్లేని పిల్లలు... చిన్ని సమాజం... పెన్సిళ్ళూ ఎరేజర్లూ... చిన్నిచిన్న వాటర్ బాటిళ్ళూ... రెయిమ్ పుస్తకాలు యూనిఫారం డ్రస్సులూ... సాయంత్రం ఆడుకునే జారుడు బల్లలూ... ఇవే...ఇవన్నీ ఆస్తులు... ఏ ఆశలూ లేని లేతచిగుళ్ళు.. పరిమళం పంచడం మాత్రమే తెలిసిన పూల మాలికలు... ''రింగరింగ రోజెస్ పాకెట్ ఫుల్ ఆఫ్ రోజెస్ హషం బుష్షం వియార్ ఫాల్ డౌన్'' అట్లాగే పడిపోయి, నిస్తేజంగా పడివున్న చిన్ని రోజాపూలు... శూన్యంలోకి చూస్తున్న కళ్ళు... ముద్దుల్ని మాత్రమే కోరుకొని పెరిగిన పాల బుగ్గలు... ఎవరు పూశారు ఇంతటి చిక్కటి మసిని... ఏవరి అత్యాశ పూసింది... ఇంత నల్లటి మసిని.. పెద్ద ప్రశ్న... పెద్ద నిశ్శబ్దం... కలిసి ఆడుకున్న పిల్లలు.. కలిసి ప్రాణాలు పోగొట్టుకున్న పిల్లలు సామూహికంగా అంత్యక్రియలు...

''నిద్దురపోరా తమ్ముడా నిద్దురపోరా తమ్ముడా...'' వర్షిస్తున్న కళ్ళు... తడి తుడుచుకోవాలని ఎవ్వరికీ లేదు జో అచ్యుతానంద జోజో ముకుంద లాలి పరమానంద రామ గోవింద... జో... జో...

ఫేర్‌వెల్ మైడియర్ చిల్డ్రన్ ఫేర్‌వెల్... మా అత్యాశకూ...మా అజాగ్రత్తకూ బలైపోయిన పసికూనలూ ఫేర్‌వెల్... అందరి కళ్ళల్లో తడి... ఇంక ఏ తల్లీ జోలపాడలేదు... ఏ తల్లీ డోలలూపలేదు.. ఎన్ని కన్నీళ్ళయితే మీ పసిబుగ్గల్నంటిన మసి తుడిచిపెట్టుకుపోతుంది... ఏ డస్టరూ... శుభ్రం చేయలేని.. వ్యవస్థ... నుదుట విధాత వ్రాసిన రెయిమ్ ఏమి బాగాలేదు.. ఫేర్‌వెల్.. డియర్స్ ఫేర్‌వెల్...

* * *

కొన్నేళ్ళ తర్వాత కొత్త రంగులూ... కొత్త హంగులూ గ్లోసైన్ బోర్డు 20 x 20 అడుగులతో స్కూలు ఎంబ్లమ్‌పెద్ద పెయింటింగ్.. పేరుమారిన స్కూలు.. బిల్డింగు... అదే.. సాలెగూడు మళ్ళీ అల్లుకుంది. పిల్లల్ని మళ్ళీ ఆహ్వానిస్తూ... బాబు నేనాడుకుంటా నాన్నా.. వద్దు నాన్నా సాయంత్రం ఆడుకుందువులే ... నా బుజ్జి తండ్రివి కదూ... నా వరాల మూటవి కదూ... పిల్లోడిని ఇంటి ప్రక్కనే వున్న స్కూల్లో దించేసి... అట్నుంచి అటే... డ్యూటీకి వెళ్ళిపోవచ్చని తండ్రి ప్లానింగ్...

స్కూలు వదులుతూనే ఇట్టే వెళ్ళి అట్టే తెచ్చేసుకోవచ్చని తల్లి ఆలోచన... తల్లీతండ్రీ పిల్లలూ.. మళ్ళీ స్కూలు వైపు పయనం...

వాళ్ళందర్నీ ఆపేస్తూ బలమైన చేతులు... అదే బలం.. వద్దూ... వద్దూ... మృత్యుగహ్వరాలు.. వద్దక్కడికి... రండి విశాలమైన భవనాలు... గ్రౌండ్లు... వున్న గవర్నమెంటు స్కూళ్ళు... అదిగో అక్కడ ... దారి చూపిస్తూ.. మానవత్వం నిండిన చేతులు... అడ్డుకుంటూ.. ఆదుకుంటూ...

★



